













వేములవలసలో విక్రయానికి సిద్ధంగా కేకులు

కోటి ఆశలతో..

కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలుకుతున్నారు భీమిలి వాసులు. మేలైన మార్పులకు 2025 సంవత్సరం వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నారు. గతేడాదిలో జరిగిన మంచి కొనసాగాలని, అంతకు మించి అద్భుతాలు జరగాలని కొందరు.. గత సంవత్సరంలో చేదు అనుభవాలు ఎదురైనవారు ఆ పాత జ్ఞాపకాలు కాలగమనంలో కరిగిపోవాలని.. ఈ ఏడాది అంతా బాగుండాలని ప్రార్థిస్తున్నారు. తమ వ్యాపారం అభివృద్ధి చెందాలని వర్తకులు, విద్యాపరంగా మరో మెట్టు ఎక్కాలని విద్యార్థులు, ఉన్నత స్థానం కోసం ఉద్యోగులు, మరిన్ని విజయాలు అందుకోవాలని క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు. వారి అభిప్రాయాలు.. ఆకాంక్షలు వారి మాటల్లోనే..

– తగరపువలస/కొమ్మాది/భీమిలి/పద్మనాభం

భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలి



స్కేటింగ్‌లో 5 అంతర్జాతీయ, 26 జాతీయ, 33 రాష్ట్ర, 39, జిల్లా స్థాయిల్లో పతకాలు సాధించాను. టీనేజ్‌లో స్కేటింగ్‌లో అత్యధిక పతకాలు సాధించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ నూతన సంవత్సరంలో కొత్త ప్రణాళికతో వెళ్తున్నా. ఈ ఏడాది జూలైలో దక్షిణ కొరియాలో జరగనున్న 20వ ఆసియా చాంపియన్‌షిప్, ఆగస్ట్‌లో ఆస్ట్రేలియాలో ప్రపంచ స్కేట్ ఒషియానియాలో పతకాలు సాధించేందుకు సాధన చేస్తున్నా. పసిఫిక్ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి నా తల్లిదండ్రులు, దేశానికి గుర్తింపు తీసుకొస్తా..

– ప్రగడ శ్రీ సాహితి, స్కేటింగ్ చాంపియన్, ఎండాడ



ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని..



ఈ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిర పడాలనుకుంటున్నాను. నేను బీస్సీ కంప్యూటర్ సైన్సు చేశాను. 2023లో కాలేజీ నుంచి రిలీవ్ అయ్యాను. అప్పటి నుంచి స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు ప్రిపేర్ అవుతున్నాను. ఈ ఏడాది ఇంకా పట్టుదలతో ప్రయత్నిస్తాను.

– రెడ్డిపల్లి మణికంఠ, రెడ్డిపల్లి

చార్టెడ్ అకౌంటెంట్ కావాలని ..



నాకు ముందు నుంచి అకౌంట్స్ అంటే చాలా ఇష్టం. బీకాం పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. చార్టెడ్ అకౌంటెంట్ కావాలన్నది నా ఆకాంక్ష. ఈ ఏడాది ఇంకా పట్టుదలతో ప్రయత్నిస్తాను. భవిష్యత్తులో కచ్చితంగా సాధిస్తానన్న నమ్మకం ఉంది. ఈ కొత్త సంవత్సరం దానికి నాంది పలుకుతుందని ఆకాంక్షిస్తున్నాను.

– కర్రి హరీష్, బ్యాంక్ కాలనీ, భీమిలి


సిద్ధంగా బొకేలు

అందరూ బాగుండాలి



న్యూ ఇయర్ వస్తుందంటే ఆ జోష్ వేరు. కాలేజ్‌లో ఉన్న సమయంలో ఎన్నో కలలు.. వాటిని నెరవేర్చుకోవడం కోసం ప్రణాళికలు, ఫ్రెండ్స్‌తో వేడుకలు.. అలా గడిచిపోయింది. ఈ ఏడాది కొత్తగా అంటే.. ఎంత పని ఉన్నా ప్రశాంతంగా చేసుకునేలా ప్రయత్నించాలి. అందరూ బాగుండాలి.

– చందక జనార్ధన్, ఐటీ ఉద్యోగి, వేములవలస

అభాగ్యులకు సేవలు అందిస్తా



చిన్నప్పటి నుంచి నాకు చదువుతో పాటు సర్వీస్‌పై ఆసక్తి. ప్రస్తుతం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. కొత్త ఏడాది ఎక్కువ సమయం కేటాయించి అభాగ్యులకు సేవలు చేయాలనుకుంటున్నాను. కొత్త సంవత్సరం మంచి కార్యక్రమాలు చేయాలనేదే నా ఆకాంక్ష.

–కల్లూరి సురేష్, ఎంసీఏ విద్యార్థి, ఆనందపురం

పేదలకు వైద్యం అందించాలని..



నేను రాజమండ్రి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. తీర ప్రాంత పేద మత్స్యకారులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నది నా ప్రధాన ఆశయం. నూతన సంవత్సరం సందర్భంగా ఆ ఆశయానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాను. వేలాది మంది పేదలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారికి ఉచితంగా మంచి వైద్యం అందించాలి.

– మేరుగు ఇందుమతి, మంగమారిపేట

ద్వేషాలు వదిలేద్దాం



కొత్త సంవత్సరంలో గట్టి సంకల్పం చేసుకోవాలి. మానవ జీవితం చిన్నది. ఇందులో ద్వేషాలకు తావీయకూడదు. ఉన్నన్నాళ్లు కలసికట్టుగా ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ముందుకు పోవాలి. వీలైతే తోటివారికి సాయం చేయాలి.

– జోసఫ్ జేమ్స్, ప్రధానకార్యదర్శి, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్, తగరపువలస





మనోధైర్యమే కొండంత బలం


మాట్లాడుతున్న సెక్రటరీ బబిత

కొమ్మాది: మనిషికి మనోధైర్యమే కొండంత బలం అని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ అథారిటీ మెంబర్ సెక్రటరీ ఎం.బబిత అన్నారు. వైకల్యం కన్నా సంకల్పమే ఉన్నత స్థాయికి చేరుస్తుందన్నారు. సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పట్టుదలతో శ్రమిస్తే జీవితంలో సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌ను నియమించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ పరిరక్షణ అందరి బాధ్యత

పీఎం పాలెం: అన్యాయం ఎక్కడ జరిగినా చూస్తూ కూర్చోరాదని, వెంటనే జరిగిన సంఘటనపై సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అన్నారు. న్యాయ వ్యవస్థపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. దివ్యాంగులకు, మహిళలకు, సంవత్సర ఆదాయం రూ.3లక్షల కంటే తక్కువ గలవారికి, 18 సంవత్సరాల లోపు వయసు గలవారికి ఉచితం న్యాయ సదుపాయం ఉందని వివరించారు. ఇది క్రిమినల్ కేసులకు వర్తిస్తుందన్నారు. సదస్సులో పాల్గొన్న విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి యువత బానిస కారాదని హితవు పలికారు. సదస్సులో స్థానిక సీఐ బాలకృష్ణ, అధిక సంఖ్యలో స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

కొమ్మాది: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించామని ఏఎంవోహెచ్ కిషోర్ తెలిపారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో ఉన్న రిసార్టులు, దుకాణాలు, రెస్టారెంట్లకు మంగళవారం నోటీసులు అందించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, కప్పులు, వస్తువులు పార్సిల్స్ కోసం వినియోగించే కవర్లు నిషేధించామని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఎవరు వీటిని అమ్మినా, వినియోగించినా కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాలమ్మ ఆలయ వార్షిక వేడుకలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో వార్షిక వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు ఆలయ ప్రాంగణంలోని షిర్డీ సాయినాథుడికి అర్చకులు పట్నాల ప్రసాద్ శర్మ, రాంబాబు, హరిచరణ్ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. చంద్రంపాలేనికి చెందిన జగ్గుపిల్లి వారి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో అన్నసమారాధన నిర్వహించారు. ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన అధ్యాపకుడిని తొలగించాలి


విద్యార్థి చేతిపై గాయాలు

తగరపువలస: స్థానిక ప్రైవేట్ కళాశాలలో విద్యార్థిని చితకబాదిన కెమిస్ట్రీ అధ్యాపకుడు మహేష్‌ను తొలగించాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర కమిటీ ఉపాధ్యక్షుడు బి.సంతోష్ డిమాండ్ చేశారు. ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన ప్రశ్నలను చదవలేదనే కారణంతో విద్యార్థులను హింసించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధ్యాపకుడిని తొలగించాలన్నారు. దీనిపై ఆర్‌ఐవో మురళీధర్‌ను వివరణ కోరగా, తాను తగరపువలసలో కళాశాలకు వెళ్లి విచారించానన్నారు. విద్యార్థిని కొట్టిన అధ్యాపకుడిని తొలగించాలని కళాశాల యాజమాన్యానికి సూచించానన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన జె.కొండలరావు దంపతులను ప్రధానోపాధ్యాయుడు జి.రవి, ఉపాధ్యాయులు సత్కరించారు.

నేత్రపర్వం.. రాస పోలమాంబ రూపం



తగరపువలస: మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారు మంగళవారం నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ప్రతీ వారం విభిన్న అలంకరణలో భాగంగా ఈ వారం అమ్మవారిని వంకాయలతో అలంకరించారు. నల్ల, తెల్ల వంకాయలతో ఆలయ కమిటీ ప్రతినిధులు చేసిన అలంకరణకు కాగితాలపేటకు చెందిన మజ్జి గౌరి, భవాని సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాల శాస్త్రవేత్తలే భవిష్యత్తు ఆశాకిరణాలు


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు తదితరులు

తగరపువలస: బాల శాస్త్రవేత్తలే భవిష్యత్తు ఆశాకిరణాలని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను ప్రకటించారు. వ్యక్తిగత విభాగంలో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి ఎస్.అశ్వంత్‌కుమార్, గ్రూప్ విభాగంలో మజ్జిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.రాకేష్, జి.సూర్యతేజ తయారు చేసిన ప్రదర్శనలు ప్రథమస్థానంలో నిలిచాయి. ఉపాధ్యాయుల ప్రదర్శనలో మంగమారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.సుజాత జిల్లాకు ఎంపికయింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను భీమిలి జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, ఎంపీడీవో హనుమంతరావు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, జెడ్పీటీసీ వెంకటప్పుడు, ఎంఈవోలు శివరాణి, జయప్రద, డైట్ అధ్యాపకుడు సోమయాజులు తిలకించారు.

పద్మనాభంలో..

పద్మనాభం: వైజ్ఞానిక ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందుతుందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం హైస్కూల్లో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ప్రదర్శనలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు విద్యార్థులు 70 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రథమ స్థానాన్ని గ్రూపు విభాగంలో మద్ది, వ్యక్తిగత విభాగంలో పాండ్రంగి, ఉపాధ్యాయ విభాగంలో కస్తూర్బా విద్యాలయం, ద్వితీయ స్థానాన్ని గ్రూపు విభాగంలో పద్మనాభం, వ్యక్తిగతంగా అనంతవరం హైస్కూల్ విద్యార్థులు సొంతం చేసుకున్నారు. సర్పంచ్ తాలాడ పాప, ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మినాయుడు, ఎంఈవో రమణ, బాబులాల్, హెచ్‌ఎంలు బాలామణి, సన్యాసిరావు, విద్యా కమిటీ ఛైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

